వైభవంగా లక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణం

స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే23: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి నిత్య తిరుకల్యాణోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను ద్వివ మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవసేవను జరిపారు. అనంతరం కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతు నిర్వహించారు. కల్యాణోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వయంభూ నరసింహస్వామిని మేల్కొలిపి తిరువారాధన, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శనభాగ్యం కల్పించారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 35 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 49,11,903 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు.

రేణికుంట ఐకేపీ కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కే హనుమంత్ జండగే

ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ హనుమంత్ కె. జండగే

రాజాపేట, మే 23 : నిర్ణీత గడువులోపు ధాన్యం కొనుగోళ్లను పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంత్ కె. జండగే ఆదేశించారు. గురువారం రాజాపేట మండలంలోని రేణికుంట ఐకేపీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ వానాకాలం సమీపిస్తున్నందున ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. లారీలు, గన్నీ సంచుల కొరత లేకుండా చూడాలని, కేంద్రానికి రైతులు తెచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటా వేసి మిల్లులకు తరలించాలని సూచించారు. ఆయన వెంట సివిల్ సప్లయ్ డీఎం గోపీకృష్ణ, డీసీఓ శ్రీనివాస్‌రెడ్డి, తాసీల్దార్ దామోదర్, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, బ్యాంక్ సీఈఓ సిల్వేర్ శేఖర్, ఆర్ఐ సలీం ఉన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి : జడ్పీ సీఈఓ

పెద్దకందుకూరు పాఠశాలను పరిశీలిస్తున్న జడ్పీ సీఈఓ

యాదగిరిగుట్ట, మే 23 : ప్రభుత్వ పాఠశాలలు పునః ప్రారంభం అయ్యేలోపే మౌలిక వసతులు కల్పించాలని జడ్పీ సీఈఓ శోభారాణి అన్నారు. గురువారం యాదగిరిగుట్ట మండలంలోని పెద్ద కందుకూరు గ్రామ ప్రభుత్వ పాఠశాలను ఆమె సందర్శించారు. పాఠశాలలో తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి పనుల పురోగతిపై మండలస్థాయి అధికారులు అడిగి తెలుసుకున్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలన్నారు. పనుల పురోగతిలో యాదగిరిగుట్ట మండలం ముందంజలో ఉందని కొనియాడారు. ఆమె వెంట ఎంపీడీఓ నవీన్‌కుమార్, పంచాయతీరాజ్ సహాయ ఇంజినీర్ పూర్ణచందర్‌రావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల నిర్వహణలో నిర్లక్ష్యం .. హెచ్‌ఎం, ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసులు

- డీఈఓ నారాయణరెడ్డి

తుర్కపల్లి పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ

తుర్కపల్లి, మే 23 : పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయించడంలో నిర్లక్ష్యం వహించిన మండలంలోని దత్తాయిపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.అనూరాధతో పాటు విధులకు గైర్హాజరైన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మధు ప్రకాశ్, కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రిన్సిపాల్ డి. అనితకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంతో పాటు మల్కాపురం, దత్తాయిపల్లి, ముల్కలపల్లి ప్రభుత్వ పాఠశాలలతో పాటు రాంపూర్ గ్రామంలోని ఆదర్శ, కస్తూర్బాగాంధీ పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం తుర్కపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ జూన్ 11లోపు పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి చేయని ప్రధానోపాధ్యాయులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న ఉచిత యూనిఫాం కుడుతున్న కేంద్రాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జూన్ 6లోపు దుస్తులను పాఠశాలల హెచ్‌ఎంలకు అందించాలని ఎంపీఓ యాదగిరికి సూచించారు. ఆయన వెంట ఎంఈఓ జె. కృష్ణ, ప్రధానోపాధ్యాయులు, ఏమ్మార్సీలు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి : ఆర్డీఓ

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ అమరేందర్

బొమ్మలరామారం, మే23 : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రంలో ఓటర్లకు ఇబ్బందులు కలుగకుండా వసతులు కల్పించాలని భువనగిరి ఆర్డీఓ పి. అమరేందర్ ఆదేశించారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని గురువారం తనిఖీ చేశారు. వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం మల్యాల గ్రామంలో మినీ ఎయిమ్స్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. మినీ ఎయిమ్స్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయని, త్వరలోనే పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీనివాసరావు, ఆర్ఐ వెంకటరెడ్డి, బీఎల్ఓలు ఉన్నారు.

స్వర్ణగిరి ఆలయంలో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీ

భువనగిరి కలెక్టరేట్, మే 23 : భువనగిరి పట్టణ పరిధిలోని పగిడిపల్లిలో ఉన్న స్వర్ణగిరి ఆలయాన్ని గురువారం ఫుడ్ సేఫ్టీ డిజిగ్నేటెడ్ ఆఫీసర్ ఎం. సుమన్ కళ్యాణ్, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ స్వాతి తనిఖీ చేశారు. ఆలయంలో అన్నప్రసాదాల తయారీని పరిశీలించారు. ప్రసాదాలు తయారుచేసే వారికి పలు సూచనలు చేశారు. ప్రసాదాలు తయారు చేసే గదిని శుభ్రంగా ఉంచాలని, అందులో వినియోగించే పదార్థాలు నాణ్యమైనవే వాడాలని సూచించారు. వారి వెంట సిబ్బంది ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డిని గెలిపించాలి

- బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మే 23 : ప్రజల సమస్యలపై పెద్దల సభలో ప్రభుత్వాన్ని నిలదీసే దమ్మున్న నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు చింతల వెంకటేశ్వర్‌రెడ్డి పట్టభద్రులను కోరారు. గురువారం మండలంలోని పిలాయిపల్లి గ్రామంలోని ఎరుకల నాంచారమ్మ దేవాలయాన్ని ఆయన సందర్శించి పూజలు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే అన్ని వర్గాలను రేవంత్‌రెడ్డి మోసం చేశారన్నారు. రైతుల ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ ఇస్తామని మ్యానిఫెస్టోలో ప్రకటించిన కాంగ్రెస్, ఇప్పుడు కేవలం సన్న ధాన్యానికే ఇస్తామని చెప్పి రైతులను మోసం చేస్తున్నదని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పాటయ్యాక పదేండ్ల పాటు అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని దేశంలోనే నంబర్‌వన్‌గా నిలబెట్టిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వానిదే అన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ బందారపు సుమలతా లక్ష్మణ్‌గౌడ్, మాజీ సర్పంచ్ అందేల హరీశ్ యాదవ్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కుతాడి సురేశ్, నాయకులు మహేశ్, భాస్కర్, మల్లేశ్, వెంకటేశ్, సాయి పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు చందర్‌గౌడ్

రాకేశ్‌రెడ్డి గెలుపుతోనే నిరుద్యోగ సమస్య పరిష్కారం

ఆత్మకూరు(ఎం), మే23 : నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రజా గొంతుకను పెద్దల సభలో వినిపించే వ్యక్తి, విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డికి పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. బీఆర్‌ఎస్ విద్యార్థి, యువజన సంఘాల బాధ్యులు రాకేశ్‌రెడ్డి గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, జిల్లా నాయకులు కోరె భిక్షపతి, బీసు ధనలక్ష్మి, విద్యార్థి విభాగం మండలాధ్యక్షుడు చుంచు నాగరాజు, యువజన నాయకులు దుంప పర్శరాములు, గడ్డం సతీశ్, విశాల్, వంశీకృష్ణ, నర్సింహారెడ్డి, వినయ్, శ్రీధర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

తుర్కపల్లి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం మండలంలోని గంధమల్ల, మోతీరాంతండా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. విద్యావంతుడైన రాకేశ్‌రెడ్డిని గెలిపించి పెద్దల సభకు పంపడం ద్వారా నిరుద్యోగుల, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయవచ్చన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల సెక్రటరీ జనరల్ శ్యాగర్ల పరమేశ్, బానోతు భాస్కర్‌నాయక్, బద్దునాయక్ నాయకులు పాల్గొన్నారు.

రామన్నపేటలో

రామన్నపేట : బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ పార్టీ నాయకులు గురువారం సిరిపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ప్రధానకార్యదర్శి పోశబోయిన మల్లేశం, బొక్క మాధవరెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు బండ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శ్రవణ్‌కుమార్‌రెడ్డి, ఆవుల నరేందర్, కోళ్ల స్వామి పాల్గొన్నారు.

వలిగొండలో..

వలిగొండ : ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ బీఆర్‌ఎస్ నాయకులు గురువారం పట్టణంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి ఓటు అభ్యర్థించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీ పల్సం రమేశ్, కొమిరెల్లి సంజీవరెడ్డి, ఐటిపాముల సత్యనారాయణ, కొండూరి వెంకటేశం, ప్రభాకర్, అఫ్రోజ్, పబ్బు వెంకటరమణ, కాసుల మధు, బల్గూరి నరేశ్‌రెడ్డి, నర్సింహ పాల్గొన్నారు.

రాకేశ్‌రెడ్డికి భారీ మెజార్టీ ఖాయం

- బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు

భువనగిరి కలెక్టరేట్, మే 23 : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగబాలు పిలుపునిచ్చారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. రాకేశ్‌రెడ్డి నిరుద్యోగుల కోసం జాబ్ మేళాతో పాటు, నైపుణ్య శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. పట్టభద్రులు, నిరుద్యోగుల కోసం పోరాడే వ్యక్తిత్వం ఉన్న వ్యక్తి అన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో కపిలవాయి దిలీప్‌కుమార్, పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపించిన పట్టభద్రులు మరో మారు బీఆర్‌ఎస్ బలపర్చిన రాకేశ్‌రెడ్డిని గెలిపించి పెద్దల సభకు పంపాలని కోరారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో పట్టభద్రులు తగిన గుణపాఠం చెప్పాలన్నారు.

రామన్నపేట: సిరిపురం గ్రామంలో రాకేశ్‌రెడ్డి గెలుపుకోసం ఓట్లు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తుర్కపల్లి : మోతీరాంతండాలో ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

వలిగొండలో పట్ట భద్రులను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

రాజాపేట, మే 23 : ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ కూతల నాగవేణి కోరారు. పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతిపై గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పనులను పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల చైర్‌పర్సన్లు సమన్వయంతో పని చేసి పనులు నాణ్యతతో జరిగేలా చూడాలన్నారు. సమావేశంలో ఏపీఎం నరసింహం, ప్రధానోపాధ్యాయులు మహేందర్‌రెడ్డి, రమాదేవి, ఏఈ సహదేవ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గాల్‌రెడ్డి సస్పెన్షన్

రాజాపేట, మే 23 : బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గొల్లపల్లి రాంరెడ్డి అధ్యక్షతన గురువారం మండల కేంద్రంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మదర్‌డెయిరీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు అర్కాల గాల్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించారు. తీర్మాన పత్రాన్ని పార్టీ అధిష్టానానికి పంపించారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, నాయకులు రెడ్డిబోయిన రాజు, బూర్గు నర్సిరెడ్డి, గుంటి మధుసూదన్‌రెడ్డి, ఠాకూర్ ధర్మేందర్‌సింగ్, రేగు సిద్దులు, నాగిర్తి గోపిరెడ్డి, ఉప్పలయ్యగౌడ్, మోత్కుపల్లి నవీన్, జూకంటి బాలస్వామి, యమ్మ భాస్కర్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

రాజాపేట, మే 23 : మండల కేంద్రంలో పునరుద్ధరించిన శివాలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి వైరాగ్యం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మహాస్నపన పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో పులిగిల్ల నర్సింహులు, బేజుగం నాగభూషణం, నంగునూరి కృష్ణమూర్తి, ప్రభాకర్, మార్త జగదీశ్, నాళ్ల శేఖర్ పాల్గొన్నారు.

ఆలయ హుండీ అపహరణ

రామన్నపేట, మే23: మండలంలోని దుబ్బాక శివారులోని వంకబయన్న ఆలయం హుండీని బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం నిత్యపూజలు చేసేందుకు పూజారి శుభకోటి కృష్ణమాచారి ఆలయానికి వెళ్లగా హుండీ కనిపించలేదు. దాంతో పోలీసులకు సమాచారం అందించాడు. పోలీస్ మొబైల్ పెట్రోలింగ్ టీం ఆలయాన్ని సందర్శించి వివరాలు సేకరించింది.

విత్తన మేళాను వినియోగించుకోవాలి : ఏఓ

భూదాన్ పోచంపల్లి, మే 23 : ఈ నెల 24న రాజేంద్రనగర్ అగ్రికల్చర్ కాలేజీలో నిర్వహించే విత్తనాల మేళాలో సబ్సిడీ ధరకు అన్ని రకాల విత్తనాలు లభిస్తాయని మండల వ్యవసాయ అధికారి ఎజాజ్ అలీ ఖాన్ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడుతూ రైతులు ఈ మేళాను వినియోగించుకోవాలని సూచించారు. జీలుగ విత్తనాలు వ్యవసాయ సహకార సంఘంలో సబ్సిడీ ధరలో అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను తీసుకు రావాలని సూచించారు.

ఉరేసుకొని వివాహిత ఆత్మహత్య

మోత్కూరు, మే 23 : మోత్కూరుకు చెందిన మంచె రేఖ(38) గురువారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన మంచె కుమారస్వామి, రేఖ దంపతులు పట్టణంలో వైష్ణవి కిరాణం నిర్వహిస్తున్నారు. వారి కుమారుడు ఇంటర్‌లో ఫెయిల్ కావడంతో తల్లి మందలించింది. ఈ విషయమై తల్లీ కొడుకులు గొడవ పడ్డారు. దాంతో మనస్తాపం చెందిన రేఖ గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త కుమారస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఏమిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీతకార్మికుడి మృతి

రామన్నపేట, మే 23: మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన గీత కార్మికుడు బోయపల్లి మల్లయ్య(55) గురువారం తాటిచెట్టు పైనుంచి పడి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లయ్య కల్లుగీసేందుకు చెట్టు ఎక్కగా.. ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన మల్లయ్యను స్థానికులు దవాఖానకు తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మల్లయ్య తెలిపారు.

వెండి నాగశేషం బహూకరణ

మోత్కూరు, మే 23 : మోత్కూరులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలోని శివలింగానికి వెండి నాగశేషాన్ని పట్టణానికి చెందిన మిట్టపల్లి నాగేశ్, నర్మద దంపతులు గురువారం బహూకరించారు. ఆలయంలో పూజలు చేసిన అనంతరం రూ.1.40లక్షల విలువైన నాగశేషాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామచంద్రుగౌడ్, మిట్టపల్లి నిఖిల్, అభిలాష, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పిల్లాయిపల్లిలో ఘనంగా నాంచారమ్మ జాతర


జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మే23 : భూదాన్ పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామంలో ఎరుకల నాంచారమ్మ ఆలయంలో జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. సాయంత్రం పోతరాజుల విన్యాసాలు, డప్పు చప్పుళ్ల మధ్య మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఎంపీఓ మజీద్, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి జాతరలో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బంధారపు సుమలత లక్ష్మణ్‌గౌడ్, మాజీ సర్పంచ్ అందెల హరీశ్‌యాదవ్, డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, సీనియర్ నాయకుడు సామ మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ , పీఏసీఎస్ వైస్ చైర్మన్ సామ మోహన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు

గ్రామదేవతలకు జడ్పీ చైర్మన్ పూజలు

పూజలు చేస్తున్న జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

వలిగొండ, మే23: మండలంలోని అర్రూరు గ్రామంలోని చెన్నకేశవస్వామి, ముత్యాలమ్మ తల్లి ఆలయాన్ని గురువారం జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆయను ఆశీర్వచనాలు అందించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు కొడితల నాగరాజు, జక్కిడి శ్రీనివాస్‌రెడ్డి, ఓరుగంటి స్వామి, బాసాని శ్రీనివాస్, ఆకుల మత్స్యగిరి, కల్యూరి రాములు ఉన్నారు.

సమావేశంలో పాల్గొన్న హాస్టల్ వార్డెన్లు

హాస్టల్ వార్డెన్లకు పదోన్నతుల్లో అవకాశం కల్పించాలి

- గిరిజన వసతి గృహాల సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నర్సింగ్

యాదగిరిగుట్ట, మే 23 : అర్హులైన గిరిజన హాస్టల్ వార్డెన్లకు పదోన్నతులు కల్పించాలని ప్రభుత్వ గిరిజన వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జె. నర్సింగ్ కోరారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని రెడ్డి సంక్షేమ భవనంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. హాస్టల్ వార్డెన్ గ్రేడ్-2 నియామక పద్ధతిలో 80 శాతం డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటా, 10 శాతం టీచర్ల కోటా, 10 శాతం క్లాస్-4 కోటా పద్ధతిలో నియమించాలని డిమాండ్ చేశారు. అనంతరం కొత్త కమిటీని ఎన్నుకున్నారు. గిరిజన వసతి గృహ సంక్షేమ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా బి. రవీందర్‌నాయక్, ఉపాధ్యక్షుడిగా తిరుపతయ్య, కార్యదర్శిగా బి. శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మేడ్చల్ హాస్టల్ వార్డెన్ రవీందర్ నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘం గౌరవాధ్యక్షుడు లాల్‌సింగ్, నాయకులు నరేందర్, బాలకృష్ణ, సుధాకర్, విజయభారతి, రక్కురెడ్డి, చిన్నానాయక్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

యాదగిరి గుట్టపై కూలిన చలువ పందిళ్లు

గాలివానకు కూలిన చలువ పందిళ్లు

యాదగిరిగుట్ట, మే23 : యాదగిరిగుట్ట కొండపైన గురువారం తెల్లవారుజామున కురిసిన ఈదురు గాలులతో కూడిన వర్షానికి చలువ పందిళ్లు కూలిపోయాయి. భారీ వర్షానికి క్యూ కాంప్లెక్స్, దుకాణాలు, బస్టాండ్ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పందిళ్లు కూలాయి. దాంతో పాటు క్యూ కాంప్లెక్స్ పైన వసతి గృహానికి వెళ్లే దారిలో, మెట్లపైన ఏర్పాటు చేసిన టార్పాలిన్‌లో వర్షపు నీళ్లు నిలువగా సిబ్బంది తొలగించారు.

పొద్దటూర్‌లో వర్షానికి మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న వెంకట్‌రెడ్డి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

వలిగొండ, మే23: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని బీఆర్‌ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు తుమ్మల వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని పొద్దటూరులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులతో కలిసి పరిశీలించారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి నెల రోజులు దాటినా నేటికీ కొనుగోళ్లు చేపట్టలేదన్నారు. దాంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసి మొలకెత్తడంతో రైతులు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధాన్యం ఎగుమతులను వేగవంతం చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గరిసె నర్సమ్మ, నాయకకులు నరేశ్, కల్యూరి రాములు, కాశమల్ల శేఖర్, నాగిళ్ల యాదగిరి, సురేశ్, జంగయ్య పాల్గొన్నారు.


అవార్డులు అందిస్తున్న నిర్వాహకులు

సమాజ సేవకులకు అవార్డులు

మోత్కూరు, మే 23 : వివిధ రంగాల్లో సమాజ సేవ చేస్తున్న వారికి మోత్కూరు మండలంలోని పాటిమట్లకు చెందిన మాతృదేవోభవ-పితృదేవోభవ సంస్థ నిర్వాహకులు అవార్డులు అందించారు. సంస్థ పంచమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కుర్మిటి నవీన్, సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు అవార్డులు అందించారు. మోత్కూరుకు చెందిన ఎస్‌ఎన్‌చారి, వెలిమినేటి జహంగీర్, దబ్బేటి సొంబాబు, సూరోజు భాస్కరాచారి, చేతరాశి అంజయ్య, కోక భిక్షం, రేపాక గ్రామానికి చెందిన ముక్కాముల లింగమల్లు అవార్డులు అందుకున్నారు. కార్యక్రమంలో ప్రపంచ రక్త దాత డాక్టర్ సంపత్‌కుమార్, వాసు పాల్గొన్నారు.